సాక్షి
బాపట్ల
గురువారం । 12 । డిసెంబర్ । 2024



కంది పైరు పరిశీలన

కారెంపూడి: సౌభాగ్య 133–33 కంది వంగడాన్ని సాగు చేసిన పొలాన్ని గుంటూరు లాం ఫాం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. రైతుకు సూచనలు చేశారు.



సత్తెమ్మతల్లి దర్శనం

అచ్చంపేట: మాదిపాడు అటవీప్రాంతంలో సత్తెమ్మ తల్లిని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆయనకు స్వాగతం పలికారు.



సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 582.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.

కూటమి సపోర్టు లేదు

కష్టాల్లో ఉన్న గంగపుత్రులు ఆశలపై కూటమి సర్కార్ నీళ్లు చల్లింది. గంగపెడు ఆశలు పెట్టుకున్న వాడరేవు పోర్టుపై శీతకన్ను వేసింది. మారిటైం బోర్డు ద్వారా కొత్త టెక్నాలజీ, తక్కువ ఖర్చు విధానంతో ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో అర్ధంతరంగా పనులను నిలిపి వేసింది సర్కార్. దీంతో వాడరేవు పోర్టు అసలు మొదలయ్యేనా ? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

వాడరేవు పోర్టుపై కారుమబ్బులు

- రూ.455కోట్లతో వైఎస్. జగన్ పాలనలో టెండర్లు
- తక్కువ ఖర్చు, నూతన టెక్నాలజీ పేరుతో నిలుపుదల
- భూసేకరణ జరిగినా మొదలు కాని పనులు
- చీరాలపై కూటమి సర్కార్ కోలుకోలేని దెబ్బ



వాడరేవు గ్రామం వ్యూ

చీరాల: వాడరేవు పోర్టు కొన్ని దశాబ్దాల కల. అనుకున్నట్లుగా పనులు సజావుగా జరిగితే చీరాల ప్రాంతం అభివృద్ధి వైపు దూసుకెళ్లేది. గత ప్రభుత్వంలో వాడరేవు పోర్టుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. పనుల కోసం రూ.455 కోట్లు కూడా కేటాయించారు. తొమ్మిది ఎకరాలు కూడా భూ సేకరణ చేశారు. మరో 19 ఎకరాలు సీసీఎల్ఏ ద్వారా సేకరించారు. నాబార్డు, రాష్ట్ర ప్రభుత్వం నిధులు సంయుక్తంగా పోర్టు నిర్మాణం చేయాలని ప్రణాళిక వేశారు. ఇందుకు నాబార్డుతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం, మిగిలిన 80 శాతం కేంద్ర ఆధ్వర్యంలో నడిచే మత్స్యమౌలిక అభివృద్ధి సంస్థ, నాబార్డు భరిస్తాయి.

మత్స్య సంపద దళారులు పరం

పోర్టులేని కారణంగా రోజుల తరబడి సముద్రంలో వేటాడి ఒడ్డుకు తెచ్చిన మత్స్య సంపద తక్కువ ధరలకు దళారులు కొనుగోలు చేసి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, గోవా, కోల్‌కతాలకు తరలిస్తున్నారు. ఒకవేళ పోర్టు నిర్మాణం చేపట్టి ఉంటే ఇతర ప్రాంతాల బోట్లు, పడవలు చీరాల పోర్టుకు వచ్చి ఆగేవి. అప్పుడు కొనుగోలుదారులు పోర్టు దగ్గరే మత్స్య సంపద కొనుగోలు చేసేవారు. తద్వారా మత్స్యకారులకు మెరుగైన ఆదాయం వచ్చేది. ఒకవేళ కొనుగోలు చేయకపోయినా కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. పోర్టు నిర్మిస్తే కోల్డ్ స్టోరేజ్‌లు, ఐస్ ఫ్యాక్టరీలు, చేపలను ఆర బెట్టేందుకు ఫ్లాట్ ఫారాలు వంటి సకల సౌకర్యాలు లభించేవి. వేటాడిన తర్వాత మత్స్య సందపను అపరిశుభ్ర వాతావరణంలో ఎండబెట్టుకుంటూ అమ్మకాలు చేసుకునే దుస్థితి తప్పేది. ప్రాణాలు పణంగా పెట్టి సముద్రంలో మైళ్ల దూరం వెళ్లి వ్యయప్రయాసలు ఓర్చి ఒడ్డుకు తెచ్చిన మత్స్యసందనను మద్రాసు ఏజెంట్లు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ఏటా వచ్చే ప్రకృతి విపత్తులతో లక్షలు పెట్టి కొన్న బోట్లు, వలలు తరచూ వచ్చే తుపానులకు సముద్రంలో కొట్టుకుపోవడం, దెబ్బతినడం జరుగుతోంది. ఈ దయనీయ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని చీరాల వాడరేవు వాసులు ఎంతోకాలంగా కోరుతున్నారు.

పలుమార్లు సర్వే

చీరాలలో పోర్టు నిర్మాణానికి 2010 సంవత్సరం నుంచే సర్వే నిర్వహించారు. కేంద్రం సాగరమాల పథకం ప్రవేశపెట్టిన కొద్దిరోజుల్లోనే పోర్టుకు అనుకూల ప్రాంతమైన చీరాల వాడరేవును ప్రభుత్వాలు ఎంచుకున్నాయి. పలుమార్లు సంస్థల ద్వారా సర్వే కూఆ నిర్వహించాయి.

మినీ హార్బర్, ఫ్లోటింగ్ జెట్టి ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ అవి కేవలం ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో వాడరేవులో హార్బర్ ఏర్పాటుపై నిజాంపట్నంలో ఉన్న హార్బర్‌ను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. రూ.455 కోట్లతో టెండర్లకు దక్కించుకున్న ఏజెన్సీ పనులు ప్రారంభించకుండా కూటమి సర్కార్ నిలిపివేసింది. దీంతో ఏళ్ల తరబడి ఎదురు చూసిన పోర్టు గంగపాలు అయ్యే ప్రమాదంలో పడింది.

పోర్టు నిర్మాణం పూర్తయితే ప్రయోజనాలు ఇవి

జిల్లాలోని తీరప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం మత్స్యసందపను ఒడ్డుకు తెచ్చుకునే అవకాశం లేదు. పోర్టు లేకపోవడంతో కాకినాడ లేకుంటే చెన్నై ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. నిజాంపట్నం హార్బర్ ఉన్నా సామర్థ్యం సరిపడక సుదూర ప్రాంతాలకు వెళుతున్నారు. చీరాల వాడరేవు నుంచి కాకినాడ గానీ చెన్నై గాని వెళ్లాలంటే 150 కిలోమీటర్లు వెళ్లాలి. దీంతో ఆయిల్‌తో పాటు ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఇవన్నీ కలిసి వస్తాయి.



పోర్టు లేకపోవడంతో ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువలో నిలిపిన బోట్లు

త్వరితగతిన పోర్టు నిర్మాణం చేపట్టాలి



పోర్టు నిర్మాణంతో మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం సరైన వసతులు లేక మత్స్యసంపదన ఎండ బెట్టుకునేందుకు వీలు లేదు. పోర్టు నిర్మాణం పూర్తయితే మత్స్యసంపద ఎగుమతులకు మంచి అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం త్వరగా నిర్మాణం చేసి గంగపుత్రలకు అండగా నిలవాలి.

–ఎరిపిల్లి రమణ, తీరప్రాంత మత్స్యకార సంఘం గౌరవాధ్యక్షుడు

ప్రభుత్వం విధానాలు ప్రకటిస్తే పనులు ప్రారంభం

ప్రభుత్వం పోర్టులపై ప్రత్యేక విధానాన్ని అవలంబించాలని చూస్తోంది. సముద్రంలో రిటైలింగ్ వాల్స్ కాకుండా కొత్త టెక్నాలజీ, తక్కువ ధరలతో పూర్తి చేయాలనే సంకల్పంలో ఉంది. విధి విధానాలు ఖరారు కాలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలతో పనులు మొదలవుతాయి.

– పి.సురేష్, మత్స్యశాఖ, డిప్యూటీ డైరెక్టర్, అమరావతి

బాపట్ల జిల్లాకు ఉన్న వనరులు

జిల్లాలో 156 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. 56 మత్స్యకార గ్రామాలున్నాయి. 225 మోటారు బోట్లు, ఇంజన్ బోట్లు 2600, నాటు పడవలు 400 ఉన్నాయి. పోర్టు నిర్మాణం పూర్తయితే 890 ఇంజన్, 350 మెకనైజ్డ్ బోట్లుతో పాటు 75 చిన్న ఓడలు నిలుపుకునే సామర్థ్యం ఉంటుంది. ఒంగోలు, నెల్లూరు, నిజాంపట్నానికి చెందిన బోట్లు వాడరేవుకు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. సమృద్ధిగా జీవనోపాధి లభిస్తుంది.

న్యూస్‌రీల్

14న జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా 50వ జూనియర్స్ బాలుర, బాలికల కబడ్డీ జట్టు ఎంపికలను ఈనెల 14న నిర్వహిస్తునట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ డిగ్రీ కళాశాలలో ఆ రోజు ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన సూచించారు.

సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

బాపట్ల: బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్నవారికి సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తునట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40సంవత్సరాల్లోపు వారు ఈనెల 15వ తేదీలోపు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఏడాదిన్నర పాటు ఏదైనా హాస్పిస్పటల్‌లో పనిచేసిన అనుభవంతో పాటు సౌదీ అరేబియాలో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 8978886348, 9866637945, 9988853335 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన తెలంగాణ జడ్జి



నకరికల్లు: పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది పనితీరు అభినందనీయమని తెలంగాణ రాష్ట్రం దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్.హరీష్‌బాబు చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ జి.కాశయ్యతో శాఖాపరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో అనుసంధానంగా పంచాయతీరాజ్ సిబ్బంది పనితీరు ప్రజలకు చేరువగా ఉందన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు నత్తు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు విజయనగరం జిల్లాకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విలువైన బంగారు నత్తును కానుకగా సమర్పించారు. చీపురుపల్లికి చెందిన వేలూరి అమోఘ్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. సుమారు 10.5 గ్రాముల బంగారం, ఎరుపు, పచ్చ రాళ్ల పొదిగిన నత్తును దేవస్థాన అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మోపిదేవి కార్తికేయుడికి రూ.96.77 లక్షల ఆదాయం



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 96 లక్షల 77 వేల 636 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కృష్ణాజిల్లా దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. 96 రోజులకు రూ.96.77 లక్షల నగదుతో పాటు 1.560 కిలోల వెండి, బంగారం 33.300 గ్రాముల, 37 అమెరికా డాలర్లు వచ్చాయని ఈఓ తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



రైతుల ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రులో ధాన్యాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించి తక్కువ రేటుకు అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతుల బలహీనతను ఆసరాగా చేసుకుని దళారులు బస్తా రూ. 1400కే కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బస్తా రూ. 1800కు కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్యాపర్రులో ప్రభుత్వం 186 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తే, దళారులు 15 వేల బస్తాలు కొన్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యం ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా వ్యవరించారని, సాగుకు రైతు భరోసా కేంద్రాలు ద్వారా రూ. 17,500ను రైతుల ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు భరోసా ద్వారా రైతులకు రూ. 20 వేలను ఖాతాలో జమ చేస్తామని వాగ్దానం చేశారన్నారు. అధికారం చేపట్టి ఆరు నెలలు అవుతున్న రైతు భరోసా గురించి పట్టించుకోవడం లేదని అశోక్‌బాబు విమర్శించారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఈ నెల 13న బాపట్ల జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. రైతులంతా అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సంకల్ప బలంతో అన్నింటా విజయం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- హనుమత్ వైభవంపై చీరాలలో ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

చీరాల అర్బన్: సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో స్థానిక పాపరాజుతోటలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో హనుమత్ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు రెండో రోజు బుధవారంతో ముగిశాయి. ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని, అందుకు హనుమంతుడే నిదర్శమని తెలిపారు. హనుమంతుడికి ఉన్న సంకల్పదీక్ష, కార్యదక్షత అందరూ అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ప్రతి మనిషిలో కూడా తెలియని బలం ఉంటుందని, లంకకు చేరుకోవడానికి సముద్రాన్ని దాటే శక్తి హనుమంతుడికే ఉందని అందరూ చెప్పారని తెలిపారు. రామనామం మనసులో తలచుకొని, తనలోని బలంతో వాయువేగంతో సముద్రాన్ని దాటారని వివరించారు. మనలోని శక్తిని తక్కువగా చూడకుండా మనోసంకల్పంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. రామనామ జపం ఎక్కడ ఉంటే అక్కడ హనుమంతుడు కొలువుదీరతాడని, అందరూ ఆధ్యాత్మిక చింతనతో జీవనం సాగించాలని చాగంటి సూచించారు. మార్గశిర మాసంలో దశమి, ఏకాదశి పర్వదినాల్లో చీరాల ప్రాంతంలో హనుమత్ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఇవ్వడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రెండు రోజులు పాటు జరిగిన ఆధ్యాత్మిక ప్రవచనాలను వినేందుకు చీరాల పరిసర ప్రాంతాల నుంచి భారీఎత్తున ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమాన్ని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజా యుగంధర్, సతీష్‌బాబు, ప్రసాద్, అచ్చుత శేషగిరి, కమిటి సభ్యులు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

సూర్యలంక బీచ్ అభివృద్ధికి కృషి



బీచ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ తదితరులు

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ

బాపట్ల: పట్టణంలోని సూర్యలంక బీచ్‌ని స్థానిక శాసనసభ్యులు వేగేసిన నరేంద్రవర్మలో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తూ, దేశ విదేశాల నుంచి పర్యాటకుల్ని ఆకర్షించడానికి, రాష్ట్ర పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేసి, ఆర్థిక వృద్ధికి దోహదపడే లక్ష్యంతో పర్యాటకాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తిస్తూ జీవో విడుదల చేసినట్లు వివరించారు. సూర్యలంకని విశాఖ బీచ్ స్థాయికి అభివృద్ధి చేయడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ కూడా కొన్ని సూచనలు తన దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. పర్యాటక అభివృద్ధి సంస్థ తరఫున సూర్యలంక బీచ్‌ని రాష్ట్రంలో అగ్రగామి బీచ్‌గా తయారు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశ కల్పన ధ్యేయంగా పనిచేస్తామని వివరించారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ ఆధ్వర్యంలో సూర్యలంక బీచ్ అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు అంగిరేకుల వరప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అలసత్వం తగదు



చీరాల టౌన్: వలసలు నిర్మూలించి ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాల కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. చీరాల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాపట్ల జిల్లా పరిధిలోని 25 మండలాలకు చెందిన ఎన్ఆర్ఈజీఎస్ అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బందితో పీడీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా ఏపీఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లు, టీఏలతో మండలాల్లో చేస్తున్న ఉపాధి పనులు, కూలీలకు చెల్లిస్తున్న కూలీలు, మొక్కల పెంపకం, ఉద్యానవనం, నీటి లభ్యత కుంటలు తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పనితీరుపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని అన్ని పనులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని ఆయన సూచించారు.

కంటైనర్‌ను ఢీకొన్న లారీ

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- పేలుడు పదార్థాల లోడుతో కంటైనర్



బొడ్డువానిపాలెం వద్ద ఆర్మీకి చెందిన కంటైనర్‌ను ఢీ కొన్న లారీ

మేదరమెట్ల: పేలుడు పదార్థాల లోడుతో వెళుతున్న ఆర్మీకి చెందిన కంటైనర్‌ను వెనుక నుంచి బియ్యం లోడుతో వెళుతున్న లారీ ఢీకొన్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. రెండు గంటల ప్రాంతంలో కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం సమీపంలో ఢీకొన్న లారీ నుంచి మంటలు రావడంతో స్థానికలు అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేసి క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. ముందున్న కంటైనర్ మహారాష్ట్ర నుంచి చెన్నైకు ఆర్మీకి చెందిన పేలుడు పదార్థాలతో మరో 11 కంటైనర్‌లతో పాటు బయలు దేరింది. కంటైనర్లు బొడ్డువానిపాలెం వద్ద బంకులో పెట్రోలు కొట్టించుకునేందుకు రోడ్డు పక్కన ఆగాయి. ఆదే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో నిలిపిన మిగిలిన కంటైనర్లను కిలోమీటరు దూరంలోకి వెళ్లి ఆపుకొన్నారు. మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

యార్డుకు 51,004 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 51,004 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 49,509 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,119 బస్తాల మిర్చి నిల్వ ఉన్నటు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

యద్లపాడు: ఇంట్లో ఒంటరిగా ఉన్న వద్దురాలి మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని యువకుడు తెంచుకుపోయిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని సందెపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు ఊటుకూరి అనసూయమ్మ ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి 'మీ అబ్బాయితో పనుంది ఇంట్లో ఉన్నాడా?' అంటూ అడిగారు. లేదని అనసూయమ్మ చెప్పడంతో అయితే పెన్ను పేపర్ ఇవ్వండి ఫోన్ నంబర్ రాసిస్తాం. వచ్చాక అబ్బాయి చేత ఫోన్ చేయించండి అంటూ నమ్మ బలికారు. మంచం మీద ఉన్న వృద్ధురాలు కిందికి దిగి పేపరు పెన్నును వెతికే క్రమంలో ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసును ఇద్దరూ లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితులు యద్లపాడు పోలీసులను ఆశ్రయించారు.

అంగలేరు వాగులో పడి యువకుడి మృతి



శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామంలో గేదెలను పొలానికి తోలుకుని వెళుతుండగా మార్గం మధ్యలో అంగలేరు వాగులో పడి యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు ..గ్రామానికి చెందిన దావులూరి హరీష్ (20) గేదెలను పొలానికి మేత కోసం తోలుకొని వెళుతుండగా సమీపంలో ఉన్న అంగలేరు వాగు మధ్యలో ఏర్పాటు చేసిన చెక్‌డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందాడు. ఘటన స్థలాన్ని ఎస్ఐ లేళ్ల లోకేశ్వర రావు, వీఆర్వో ఉప్పులూరి మంగయ్య పరిశీలించారు. పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

266 పరుగులకు రాజస్థాన్ ఆలౌట్



అర్ధ సెంచరీ చేసిన యశ్వంత్ భరద్వాజ్

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన విజయ్ మర్చంట్ ట్రోఫీ (అండర్ 16 మెన్) క్రికెట్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు 266 పరుగులకు ఆలౌటైంది. బుధవారం రాజస్థాన్ , ఉత్తరాఖండ్ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు 82.01 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్‌లు యశ్వంత్ భరద్వాజ్ 8 ఫోర్లతో 50 పరుగులు సాధించాడు. ఎస్.ఖాన్ 48 పరుగులు చేశాడు. ఉత్తరాఖండ్ బౌలర్లు అభిమన్యు, ఎండీ షాహిద్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 5 ఓవర్లలో 8 పరుగులు సాధించింది.

కీచకుడి అకృత్యాలపై ఉపేక్షిస్తే ఉద్యమం

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- రెడ్‌బుక్ రాజ్యాంగం వల్లే ఇటువంటి దారుణాలు



కిష్కింధపాలెం పాఠశాలలో ఎంఈఓను ప్రశ్నిస్తున్న వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు: విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించి వృత్తికే మాయని మచ్చ తెచ్చిన కీచక ఉపాధ్యాయుడి అకృత్యాలపై ఉపేక్షిస్తే ఉద్యమిస్తామని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. కిష్కింధపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న వల్లభనేని వెంకటేశ్వరరావు 6, 7 తరగతులు చదువుతున్న పలువురు విద్యార్థినులతో గత మూడు నెలలుగా అసభ్యంగా ప్రవరిస్తున్నాడు. విద్యార్థులతో అనుచిత ప్రవర్తన విషయం గురించి వెంకటేశ్వరరావును మరో ఉపాధ్యాయుడు ప్రసాద్ ప్రశ్నించాడు. విషయం బయటకు పొక్కిందని తెలుసుకున్న కీచక ఉపాధ్యాయుడు అప్పట్నుంచి సెలవులో ఉన్నాడు. తిరిగి సోమవారం పాఠశాలకు రావడంతో భయపడిపోయిన విద్యార్థినులు పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టపడకపోవడంతో వారి తల్లిదండ్రులు విషయాన్ని అడిగారు. ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు లైంగికంగా వేధిస్తున్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి అతడ్ని నిలదీశారు. ఉపాధ్యాయుడిని నిలదీయడంతోపాటు, అతనికి దేహశుద్ధి చేసి కొల్లూరు పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై రేపల్లె డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు పాఠశాలలో విచారించి వెంకటేశ్వరరావుపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేశారు

న్యాయం కోసం పోరాటం

వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు బుధవారం కిష్కింధపాలెంలో బాధిత విద్యార్థినుల తొమ్మిది కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉండి న్యాయం జరిగేందుకు పాటుపడతామని హామీ ఇచ్చారు. జరిగిన సంఘటనతో మనోధైర్యం కోల్పోకుండా విద్యను కొనసాగించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థినులకు ధైర్యం నింపారు. అనంతరం ఆయన పాఠశాలకు వెళ్లి జరిగిన సంఘటనపై ఉపాధ్యాయులు, ఎంఈఓ-2 సౌభాగ్యజ్యోతిని ప్రశ్నించారు. జరిగిన సంఘటన కారణంగా విద్యార్థులు 70 శాతం పైగా పాఠశాలకు రాకుండా మానుకుంటే ఉన్నతాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈఓతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలను తిరిగి సక్రమంగా నిర్వహించేందుకు డీఈఓ గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణం పాఠశాలను సందర్శించి శాఖపరంగా కీచక ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యం కారణంగా విద్యార్థినులకు రక్షణ కరువైందని మండిపడ్డారు. నారా లోకేష్ తీసుకొచ్చిన రెడ్‌బుక్ రాజ్యాంగం కారణంగానే వ్యవస్థలు భ్రష్టుపట్టిపోయాయని విమర్శించారు. తక్షణం బాధిత కుటుంబాలను పరామర్శించి తొమ్మిది మంది విద్యార్థినులకు తగిన నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వేధింపులకు గురైన విద్యార్థినుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిన పక్షంలో ఉపేక్షించే ప్రసక్తేలేదని, బాధిత కుటుంబాల తరఫున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

స్కేటింగ్‌లో మెరిసిన చిన్నారులు



గోల్డ్ మెడల్ సాధించిన మెరుగుపాల ఆశిష్



సందు కోటేశ్వర్

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్‌కు చెందిన బాలుడు మెరుగుపాల ఆశిష్, ఉండవల్లికి చెందిన విద్యార్థి సందు కోటేశ్వర్ స్కేటింగ్‌లో ప్రతిభ చాటారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారు. స్థానికులు బుధవారం వారిని అభినందించారు. డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల ఆశిష్ 11, 14 సంవత్సరాల వయస్సు కలిగిన స్కేటింగ్ కేటగిరీలో జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. సందు కోటేశ్వర్ 9-11 సంవత్సరాల విభాగంలో జాతీయ స్థాయిలో సత్తా చాటి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. మూడు సంవత్సరాల నుంచి కోటేశ్వర్ జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పతకాలు సాధిస్తూ తన సత్తా చాటుతున్నాడు.

కుంకలగుంటలోని ఆలయంలో చోరీ



ఆలయంలో చోరీ జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు



ఆలయం వెనుక భాగంలో పగులగొట్టి ఉన్న హుండీలు

నకరికల్లు: కుంకలగుంటలోని శ్రీకార్యసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ కథనం ప్రకారం.. ఆలయంలో శనివారం రాత్రి పూజలు ముగించుకున్న పూజారి కారంపూడి రాఘవాచార్యులు ప్రధాన గేటుకు తాళాలు వేసి వెళ్లారు. బుధవారం ఉదయం 6గంటల సమయంలో ఆలయ ప్రాంగణం శుభ్రం చేసేందుకు వచ్చిన మహిళకు గేటు తాళాలు పగలగొట్టి ఉండడంతోపాటు రెండు హుండీలు పగులగొట్టి ఆలయం వెనుక భాగంలో కన్పించడంతో ఆలయ నిర్వాహకులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనాస్థలానికి పోలీసులతోపాటు క్లూస్‌టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. ప్రధాన గేటు తాళాలు పగులగొట్టిన దుండగులు ఆలయంలోని రెండు హుండీలను వెనుకభాగానికి తీసుకువెళ్లి అందులోని సుమారు రూ.45వేల అపహరించారు. అక్కడి నుంచి వెళ్తూ ఆలయానికి కొద్దిదూరంలోనే ఇంటి వద్ద నిలిపి ఉన్న బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ కూడా అపహరించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

ఉరుకులు పరుగులతో కట్టేతలు



వరి ఓదెలను కట్టలు కడుతున్న కూలీలు



కుప్పలు వేస్తున్న వ్యవసాయ కూలీలు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట చేతికందే తరుణంలో వాతావరణంలో మార్పులతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమవ్వడంతో కోతలు కోసిన రైతుల గుండెల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో 3వేల ఎకరాలల్లో దాకా వరి పంట ఓదెల రూపంలో ఉంది.ఈ తరుణంలో కారు మబ్బులు పట్టి చిరు జల్లులు పడుతుండటంతో రైతులు హడావుడిగా కట్టేతలు కడుతున్నారు. రైతుల ఆందోళన, వాతావరణంలోని మార్పులను ఆసరా చేసుకుని కూలీలు ఒక్కసారిగా రేట్లు పెంచేశారు. వరి కట్టేతలకు ఎకరానికి సాధారణ పరిస్థితులలో రూ. 5,000 నుంచి రూ. 5,500 వరకు ఉండేది. ఇప్పుడు ఎకరానికి రూ. 7,000 నుంచి రూ. 7500కు చేరింది. - నగరం

వర్సిటీ జట్టుకు 'కృష్ణవేణి' విద్యార్థులు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నమెంట్‌లో కృష్ణవేణి కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు బుధవారం తెలిపారు. చోడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన తమ విద్యార్థులు ఎ.ఉమామహేశ్వరరావు, జె.నితిన్‌కిరణ్, జె.కళ్యాణ్‌కుమార్, పి.సాహిత్‌సింగ్‌లు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వెల్లడించారు. ఈ నెల 18 నుంచి 22 వ తేదీ వరకు కేరళ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఈ విద్యార్థులు ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కె.నాసరయ్య, కె.వీరరాఘవులు, ప్రిన్సిపల్ నాతాని, అధ్యాపకులు అభినందించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి

గుంటూరు రూరల్: రియల్ ఎస్టేట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో కారులో తీసుకెళ్లి అనంతరం దాడి చేసిన ఘటనపై నల్లపాడు పోలీసు స్టేషన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం... చల్లావారిపాలెం గ్రామానికి చెందిన ఇమాబత్తిన నాగేశ్వరరావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. అతడిని సమీప గ్రామమైన నల్లపాడుకు చెందిన నాగిరెడ్డి, అతని అనుచరులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి గ్రామ శివారులో డబ్బులు డిమాండ్ చేశారు. లేవని చెప్పడంతో దాడి చేశారు. తప్పించుకున్న నాగేశ్వరరావు జీజీహెచ్‌లో చికిత్స పొందారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: పాఠశాల తరగతి గదిలో నిద్రించిన ఉపాధ్యాయుడికి జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.వి. నారాయణ మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో ఉన్న విద్యార్థులను పక్కనున్న అంగన్‌వాడీ కేంద్రంలోనికి పంపి, పాఠశాల తరగతి గదిలో నిద్రిస్తున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'గురువు గారూ ఇది తగునా..!' శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఎంఈవోలు సీహెచ్. రమాదేవి, జి. లీలారాణిలు విచారణ జరిపి డీఈవోకు నివేదిక అందించారు. హెచ్ఎం కొంత అస్వస్థతకు గురై, ఆరోగ్యం సహకరించక విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచి విశ్రాంతి తీసుకున్నారని, ఈ మేరకు అంగన్‌వాడీ సహాయకురాలు లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చారని నివేదికలో పేర్కొన్నారు. దీంతో ఎంఈవోలు ఇచ్చిన నివేదిక ఆధారంగా సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసుతోపాటు ఆర్టికల్స్ ఆఫ్ చార్జెస్ కూడా జారీ చేసినట్లు డీఈవో సి.వి. రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో విజయ్ కుమార్ మృతదేహం

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం జరిగింది. మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం... నాదెండ్ల మండలం సంకురాత్రి పాడు గ్రామానికి చెందిన నన్నం విజయ్ కుమార్ (35) భార్య గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై సంకురాత్రి పాడు నుంచి గుంటూరు వెళుతున్నారు. మార్గంమధ్యలో పేరేచర్ల పరిధిలోని రవీంద్ర హోటల్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ సంఘటనలో విజయ్ కుమార్ తలకు తీవ్ర గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

ప్రయోగాలతో విప్లవాత్మక ఫలితాలు

చేబ్రోలు: కొత్త ప్రయోగాలతో విప్లవాత్మక ఫలితాలు వస్తాయని ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ పద్మశ్రీ వీకే సింగ్ అన్నారు. కర్బన ఉత్ప్రేరిత చర్యల ద్వారా విప్లవాత్మక ఫలితాలను సాధించవచ్చునని చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'జాయింట్ ఇండో- ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ సెమినార్ ఆన్ ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపరరీ విస్తాస్ ఇన్ అప్లైయింగ్(ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల సెమినార్‌ను బుధవారం ప్రారంభించారు. తొలుత బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రొఫెసర్ వీకే సింగ్ మాట్లాడుతూ.. క్రియేటివిటీ ద్వారా పర్యావరణ అనుకూల కాటలిస్ట్‌లను అభివృద్ధి చేయడం సులభమన్నారు. ఇది గ్రీన్ కెమిస్ట్రీ దిశగా ముందడుగు వేసినట్లని పేర్కొన్నారు. సీఈఎఫ్ఐపీఆర్ఏ డైరెక్టర్ ప్రొఫెసర్ నితిన్ సేథ్ మాట్లాడుతూ సీఫిప్రా ద్వారా భారత్ - ఫ్రాన్స్ మధ్య శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అనేక పద్ధతుల్లో మౌలిక సహకారం అందుతోందన్నారు. వివిధ దేశాల ప్రతినిధులు, వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్‌లు డీబీ రామాచారి, పిజ వెంకటేశు, మధుసూదన్, విజ్ఞాన్ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న గుంటూరు-ప్రకాశం జిల్లా జట్లు



వాలీబాల్ పోటీలో ప్రకాశం-బాపట్ల జట్లు



బ్యాడ్మింటన్ ఆడుతున్న విజయవాడ - నరసరావు పేట జట్లు

పెదకూరపాడు: జీఆర్‌సీఆర్‌కే చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో చైతన్య స్కూల్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. బ్యాడ్మింటన్ పోటీలను రాత్రి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. బ్యాడ్మింటన్ మెడలిస్ట్ సెమీ ఫైనల్‌లో విజయవాడకు చెందిన వంశీ-రాహుల్, మునీర్-హేమంత్ జోడీల మధ్య హోరాహోరీ పోటీ జరిగింది. ఈ పోటీలో వంశీ-రాహుల్ మొదటి విజేతగా నిలిచారు. మరో సెమీఫైనల్‌లో నరసరావుపేటకు చెందిన ధనుష్-ధీరజ్, విజయవాడకు చెందిన జితేంద్ర-నవీన్ మధ్య గట్టి పోటీ నెలకొంది. ధీరజ్-ధనుష్ విజేతలుగా నిలిచి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ నాన్ మెడలిస్టులో నరసరావుపేటకు చెందిన బాష, చక్రీల జోడీ మొదటి స్థానంలో నిలిచింది. విజయవాడకు చెందిన జితేంద్ర, నవీన్ జోడీ రెండో స్థానం సాధించింది. విజయవాడకు చెందిన ప్రణయ్-మల్లి మూడో స్థానం, పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే చైతన్య స్కూల్‌కు చెందిన అరుణ్, దానంల జోడీ 4 స్థానానికే పరిమితమైంది. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో లీగ్ దశలో 30 జట్లు పాల్గొనగా మద్దాల టీం, అంజి మెమోరియల్, గుంటూరు స్పైక్, సత్తెనపల్లి సైదాటీ టీంలు గెలుపొందాయి. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో ఒంగోలు జట్టు, బాపట్ల కర్లపాలెం జట్టు, వడ్లపల్లి కాటపాలెం జట్టు, గుంటూరు వికాస్ కాలేజీ టీం, పెదకూరపాడు జట్లు లీగ్ దశలో విజయం సాధించి ఫైనల్‌కు అర్హత పొందాయని నిర్వాహకులు కవిత, రాము తెలిపారు.



కబడ్డీ పోటీలో సిబ్బంది



పరుగు పందేంలో మహిళలు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

నగరంపాలెం: క్రీడా పోటీలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. నగరంపాలెం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్- గేమ్స్ మీట్ పోటీలను బుధవారం జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం విధుల్లో నిమగ్నమయ్యే పోలీసులకు మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. నాయకత్వ లక్షణాలు కూడా అలవాటు అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటల్లో 8 విభాగాల (ఆరు సబ్ డివిజన్లు, ఏఆర్, హెడ్ క్వార్టర్ విభాగం-1) నుంచి సుమారు 150 మంది సత్తా చాటేందుకు పోటీ పడుతున్నారు జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.